టార్గెట్‌ను మించి ఆస్తి పన్ను వసూలు

- ఫలించిన డీఎంసీల స్పెషల్ డ్రైవ్‌లు
- ముషీరాబాద్ సర్కిల్ టార్గెట్ రూ. 40.86 కోట్లకు రూ. 51.19 కోట్ల వసూలు
- అంబర్‌పేట సర్కిల్ టార్గెట్ 59.44 కోట్లకు రూ. 63.05 కోట్ల వసూలు
- నేటి నుంచి ఎర్లీ బర్డ్ స్కీమ్ అమలు



జీహెచ్‌ఎంసీ కార్యాలయం

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2024-25 ఆస్తి పన్ను వసూలు చేయడంలో ముషీరాబాద్, అంబర్‌పేట సర్కిళ్లకు ఇచ్చిన టార్గెట్‌ను మించి వసూలు చేసి రికార్డు నెలకొల్పాయి. ముషీరాబాద్ సర్కిల్‌కు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రూ.40.86 కోట్లు టార్గెట్ ఇవ్వగా డీఎంసీ రామానుజులరెడి రూ.51.19 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. అంబర్‌పేట సర్కిల్ రూ.59.44 కోట్లు ఇవ్వగా సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్‌రావు రూ.63.05 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. గ్రేటర్ పరిధిలో ఇచ్చిన టార్గెట్ కంటే ఈ రెండు సర్కిళ్లు అధిక మొత్తంలో వసూలు చేసినందుకు ఈ సర్కిళ్ల డీఎంసీలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ అభినందించారు. ఇచ్చిన టార్గెట్‌కు చేరుకోవడానికి ముషీరాబాద్ సర్కిల్‌లో 60 వేల ఆస్తి పన్ను చెల్లింపుదారుల నుంచి దశల వారీగా ఆస్తి పన్ను వసూలు చేసేందుకు డీఎంసీ, ఏఎంసీలు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షలు నిర్వహించి ప్రతి నెలలో చేయాల్సిన టార్గెట్‌ను పెట్టుకున్నారు. ఆ టార్గెట్ చేరుకోవడానికి అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారి జాబితాను సిద్ధం చేసి వారి నుంచి ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయడానికి స్పెషల్ డ్రైవ్‌లు కూడా చేశారు. ఈ డ్రైవ్‌లలో భాగంగా పలు వ్యాపార సంస్థలను సీజ్ చేసి ఆస్తి పన్ను వసూలు చేయడంతో అధికారులు టార్గెట్‌ను పూర్తి చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్ భవన్ నుంచి ముషీరాబాద్ సర్కిల్‌కు 20 కోట్లు రావాల్సి ఉండగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉండడంతో పలు దఫాలు అధికారులు చర్చలు జరిపి ఎట్టి పరిస్థితుల్లో పన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించి మార్చి చివరి వారంలో రూ.10 కోట్ల రూపాయల ఆస్తి పన్ను చెల్లించారు. దీంతో సర్కిల్ అధికారులు తమ టార్గెట్‌ను 125 శాతం చేరుకోవడం జరిగింది. అదే విధంగా అంబర్‌పేట సర్కిల్ టార్గెట్ 59.44 కోట్లు కాగా 63.05 కోట్ల వసూలు కోసం డీఎంసీ, ఇద్దరు ఏఎంసీలు 8 మంది సీఐలు 18 మంది బిల్ కలెక్టర్లు ప్రతి నెల కమిషనర్ ఇచ్చిన టార్గెట్‌కు చేరుకోవడానికి ప్రణాళికబద్ధంగా వసూలు చేశారు. ఈ సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నారాయణగూడలోని ఐపీఎం నుంచి రావాల్సిన 4 కోట్ల రూపాయలు, అదే ప్రాంతంలోని సర్వే భవన్ నుంచి రావాల్సిన 2.5 కోట్ల రూపాయలను మార్చి చివరి వారంలో ఆ శాఖలపై ఒత్తిడి పెంచి టార్గెట్‌ను పూర్తి చేశారు. దీంతో కమిషనర్ ఇచ్చిన టార్గెట్ కంటే 7 శాతం ఎక్కువగా ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగింది.

డీఎంసీల స్పెషల్ డ్రైవ్‌లు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇచ్చిన టార్గెట్‌కు చేరుకోవడానికి ఈ రెండు సర్కిల్స్ డీఎంసీలు స్పెషల్ డ్రైవ్‌లు, ఆస్తుల సీజ్ కార్యక్రమాలు స్పందించాయి. దీంతో ఇద్దరు తమకు ఇచ్చిన టార్గెట్‌ల కంటే అధిక మొత్తంలో ఆస్తి పన్ను వసూలు చేసి ప్రశంసలు అందుకున్నారు. అంబర్‌పేట సర్కిల్ ఇచ్చిన 100 శాతం టార్గెట్ కంటే 7 శాతం ఎక్కువగా చేశారు. ముషీరాబాద్ సర్కిల్‌కు ఇచ్చిన 100 శాతం టార్గెట్ కంటే 25 శాతం ఎక్కువగా చేశారు.

ఈ నెల 30 వరకు ఎర్లీ బర్డ్ స్కీమ్

ముందస్తు ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రస్తుత ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎర్లీ బర్డ్ స్కీమ్ అమలులోకి తీసుకువచ్చింది. ఈ స్కీమ్ ఈ నెల 30వ తేదీ వరకు అమలులో ఉండనున్నది. ఈ నెలాఖారులోపు కొనసాగే పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రెండు సర్కిల్స్ డీఎంసీలు ప్రజలకు సూచించారు.



జాతీయ పతాక 104వ ఆవిర్భావ దినోత్సవ సభలో పాల్గొన్న జగదాంబ, విద్యార్థినులు తదితరులు

జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ మహాసభ

నల్లకుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, పింగళి వెంకయ్య స్మారక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం విద్యానగర్‌లో 104వ జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవ మహాసభ ఘనంగా జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జగదాంబ, పింగళి వెంకయ్య స్మారక సంస్థ చైర్మన్ రామారావుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు దేశభక్తి గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్‌గా నిలిచాయి. దేశభక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం జాతీయ జెండాలను విద్యార్థులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ కార్యదర్శి జీ.ఎస్.కేశవ్, బీజేపీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రొయ్యూరి శేషసాయి, లయన్స్ క్లబ్ మెంబర్ మిలియన్ బాబురావు తదితరులు హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులకు జాతీయ భక్తిని పెంపొందించే వివిధ పోటీలలో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. వాగ్దేవి మ్యూజిక్ అకాడమి సీతారత్నం జాతీయ గీతంపై ప్రత్యేక గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ప్రసూనాంబ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



అహోబిలమఠంలో శ్రీరామనవమి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శోభాయాత్రను విజయవంతం చేయాలి

- అంబర్‌పేట ఉత్సవ సమితి కన్వీనర్ గౌతమ్‌రావు

నల్లకుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి శోభాయాత్ర ఈ నెల 6వ తేదీన జరుగుతుందని, శోభాయాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అంబర్‌పేట నియోజకవర్గం శ్రీరామనవమి ఉత్సవ సమితి కన్వీనర్ డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు కోరారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని అహోబిలమఠం వద్ద శ్రీరామనవమి శోభాయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మన చరిత్రలో శ్రీరామనవమికి ఎంతో విశిష్ట చరిత్ర ఉందన్నారు. హిందువులు భారీ సంఖ్యలో ఈ శోభాయాత్రకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు ఏడెల్లి అజయ్‌కుమార్, సి.కృష్ణగౌడ్, రమేష్‌యాదవ్, బుచ్చిరెడ్డి, చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో...

గోల్నాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమిని పురస్కరించుకుని అంబర్‌పేట ఎంసీహెచ్ గ్రౌండ్ నుంచి సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు నిర్వహించే సీతారాముల శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ బంధువులకు అంబర్‌పేట నియోజకవర్గం శ్రీరామనవమి ఉత్సవ సమితి కన్వీనర్ డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. అంబర్‌పేట చే నెంబర్ లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అంబర్‌పేట నియోజకవర్గం శ్రీసీతారాముల శోభాయాత్ర కమిటీ సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో గౌతమ్‌రావు మాట్లాడుతూ సీతారాముల శోభాయాత్రలో వేలాదిగా హిందూబంధువులు పాల్గొని విజయవంతం చేసి మన శక్తి ఏమిటో చాటిచెప్పాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో శోభాయాత్ర విజయవంతం కోసం పలు కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను జాగృత చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, వై.అమృత, బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ నేతలు, హిందూబంధువులు పాల్గొన్నారు.



గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో మట్టికుప్పలు, చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం తగదు

- కార్పొరేటర్ దూసరి లావణ్య

గోల్నాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో మంగళవారం ఆమె పర్యటించి రోడ్డుపై పేరుకపోయిన మట్టికుప్పలను, చెత్తచెదారాన్ని పరిశీలించి డివిజన్‌లోని అన్ని బస్తీలలో ఎలాంటి అపరిశుభ్రతకు తావు ఇవ్వకుండా పరిశుభ్రతయే లక్ష్యంగా పని చేయాలని అనేక మార్లు సూచించిన ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తున్న అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆమె అధికారులకు ఫోన్‌చేసి కృష్ణానగర్‌లో రోడ్డుపై పేరుకపోయిన మట్టికుప్పలను, చెత్తచెదారం దుస్థితిని తెలియజేస్తూ వెంటనే వాటిని తొలగించి శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు బస్తీలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



డ్రైవర్ ప్రతీక్ సోన్‌కాంబ్లేకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు

బర్కత్‌పుర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ నడుపుతున్న డ్రైవర్‌ను కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాకకు చెందిన ప్రతీక్ సోన్‌కాంబ్లే(25) నింబోలిఅడ్డలో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల గోల్నాక వద్ద ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందిన తర్వాత పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం మద్యం తాగి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ నడుపుతుండగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ఆల్కాహాల్ 205గా నమోదైందని తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. మద్యం తాగి ప్రైవేట్ వాటర్ ట్యాంకులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

'బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి'



బీసీ మహా ధర్నాకు తరలివెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు రాజేందర్, మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి



ఢిల్లీలో జరిగే బీసీల మహాధర్నాకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లోనూ ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం ముషీరాబాద్ నుంచి ఢిల్లీలో జరిగే బీసీ మహాధర్నాకు బీసీ కుల సంఘాల నాయకుల తరలివెళ్లారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి, నాయకులు సాయి, రాజేష్, ప్రణీత్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న బీసీల మహాధర్నాకు పెద్ద సంఖ్యలో నేతలు తరలివెళ్లారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు వీఎస్టీలో సొసైటీ ఎన్నికలు

- జనరల్ కోటాలో 21 మంది, ఎస్సీ కోటాలో ముగ్గురు పోటీ

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన ఆజామాబాద్‌లోని వీఎస్టీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ ఎన్నికలు బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర కో-ఆపరేటివ్ విభాగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈ సొసైటీకి పది మంది డైరెక్టర్లు అందులో నుంచి ఒక చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరగనున్నది. పది మంది డైరెక్టర్లలో ఒక ఎస్సీ డైరెక్టర్ కోసం ఉంటారు. ఇందులో భాగంగా 9 మంది డైరెక్టర్ల కోసం వీఎస్టీ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి, బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్యానెల్ నుంచి జనరల్ కోటాలో 21 మంది, ఎస్సీ కోటాలో ముగ్గురు పోటీ చేస్తున్నారు. సొసైటీలోని 186 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటింగ్‌లో పాల్గొన్న సభ్యులు ఒక్కొక్కరు పది ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఓట్లు వేసిన వారిలో ఏ సభ్యుడికి ఎక్కువ ఓట్లు పడతాయో వారిని డైరెక్టర్లుగా ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. ఎన్నికైన పది మంది సభ్యులు కలిసి ఒక చైర్మన్‌ను ఎన్నుకోవడం జరగనున్నది. ఈ ఎన్నికల్లో గెలుపుకోసం మూడు ప్యానెల్‌కు చెందిన అగ్ర నాయకులు గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చిక్కడపల్లి పోలీసులు వీఎస్టీ యూనియన్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న మధుసూదన్ తదితరులు

ఆధ్యాత్మిక గ్రంథాల ఆవిష్కరణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాది సందర్భంగా నోరి నరసింహశాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం త్యాగరాయగానసభలో మూడు ఆధ్యాత్మిక గ్రంథాలు ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్న మధుసూదన్ పాల్గొని కల్యాణానంద భారతీస్వామి రచించిన సౌభాగ్య భాస్కర కళ్మలమ్‌కు డా. నోరి శివసేనాని తెలుగు అనువాద వ్యాఖ్యాన గ్రంథం, వనదుర్గా మహా విద్యా పంచ శతి, గుణనికా దీధితికి డా.వారణాసి వెంకటేశ్వర్లు వ్యాఖ్యానం చేసిన గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ ఆధ్యాత్మిక చింతన విశ్వ మానవాలి శ్రేయస్సుకు ఉపయోగపడే విధం గా గ్రంథాలు ఉన్నాయన్నారు. గంభీరానంద భారతీ స్వామి, శివానందభారతిస్వామి పాల్గొనగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి అధ్యక్షత వహించారు. వెంకట రామశర్మ, వారణాసి వెంకటేశ్వర్లు, నోరి శివసేనాని గ్రంథాలను పరిచయం చేశారు.

వైభవంగా శ్రీ లక్ష్మీగణపతి హోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయప్రాంగణంలో శ్రీ లక్ష్మీగణపతి హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా ఈవో దేవనాథం పర్యవేక్షణలో నిర్వహించారు.



గోల్నాడివిజన్ కృష్ణానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ యూత్ డివిజన్ అధ్యక్షులు మహేష్ నివాసంలో జరిగిన ఎల్లమ్మ పండుగ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ దంపతులు

-గోల్నాక, ఆంధ్రజ్యోతి

దేశవ్యాప్తంగా కులగణన జరగాలి

- వడ్డెర సంఘం నేతల డిమాండ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన జరగాలని వడ్డెర సంఘం లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జరిపేటి సత్యనారాయణరాజు, వడ్డెర సంఘం తెలంగాణ (గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం చిక్కడపల్లిలో వడ్డెర సంఘం సమావేశం నిర్వహించారు. బుధవారం ఢిల్లీలో జరగబోయే బీసీల ధర్నాకు తెలంగాణ రాష్ట్రం నుంచి వడ్డెర సంఘాల నేతలు, వడ్డెర ప్రజలు పెద్దఎత్తున బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణరాజు, అంతయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ తీర్మానించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా కూడా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డెర సంఘం ముఖ్య సలహాదారు డా. ఓర్సు కృష్ణయ్య, నగర అధ్యక్షుడు మక్కాజి వెంకటేష్, పల్లపు లక్ష్మీనారాయణ, శివరాత్రి అంజయ్య, పల్లపు గణేష్, అనంతరావు, మోహన్‌కుమార్, శాంతికుమార్, వెంకటకృష్ణ, బాలరాజు, బాలకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ రామాలయం చైర్మన్‌గా నియమితులైన ఆనంద్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

రాంనగర్ రామాలయ అభివృద్ధికి కృషి

- చైర్మన్ ఆనంద్ ముదిరాజ్

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ రామాలయం అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని ఆలయం చైర్మన్ ఆనంద్ ముదిరాజ్ అన్నారు. చైర్మన్‌గా నియమితులైన ఆనంద్ ముదిరాజ్‌కు మంగళవారం రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న జరిగే శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వేడుకలకు రాంనగర్ ప్రాంత ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు. రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్ గుప్తా మాట్లాడుతూ రాంనగర్ రామాలయం అభివృద్ధికి తమ సంఘం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రాంనగర్ ఆర్యవైశ్యసంఘం నేతలు నేతి సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, ప్రకాష్, ఎర్రం శేఖర్, బుక్క రమేష్, చల్లా శివకుమార్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ డి.రవియాదవ్, స్థానికులు నర్సింగ్ ప్రసాద్, లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ సమస్యపై చర్చించాలి

- ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీ కంచగచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమి విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలతో సమావేశం నిర్వహించాలని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 400 ఎకరాల భూమి కబ్జాకు గురవుతుంటే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏమి చేస్తున్నారని, దీనిపై ఎందుకు నోరుమెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఆయన హెచ్చరించారు.

ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మంగళవారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఆయన బస్తీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. మంచినీటి లోప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని వీవీ గిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నీవి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మహిళలకు స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణాశిబిరాన్ని ఆమె సందర్శించారు. ఇటీవల ప్రారంభించిన బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ పొందుతున్న మహిళలతో కార్పొరేటర్ మాట్లాడారు. శిక్షణా తరగతులపై టీచర్లు బోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అందుకోసం కార్పొరేటర్‌గా ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు సాయికుమార్, ఆనంద్‌రావు, సాయి, శిక్షణను అందిస్తున్న టీచర్లు పాల్గొన్నారు.



అంజనీకుమారికి ఉగాది పురస్కారం బహూకరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

అన్ని రంగాల్లోనూ మహిళలు సత్తాచాటాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం త్యాగరాయగానసభలో మహిళా దినోత్సవ వేడుకలు స్వర ఝరి భువన భాస్కర సంగీత సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. బహుగళ గాయని, నిర్వాహకురాలు భువన రాధశ్రీకుటుంబరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అంజనీకుమారి మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా మహిళలు వివిధ రంగాల్లో రాణించి తమ సత్తాచాటాలన్నారు. ఈ సందర్భంగా అంజనీకుమారితోపాటు పలు రంగాల్లో నిష్ణాతులైన మహిళలకు ఉగాది పురస్కారాలను బహూకరించారు. కార్యక్రమంలో సినీ నటులు పి.శ్రీనివాస్, జానకి, ఆలిండియా రేడియో ఆర్టిస్ట్ అర్పిత, విల్సన్, ప్రేమారెడ్డి, కె. వెంకటరావు, మల్యాద్రి, సంధ్యారాణి, కృష్ణంరాజు, పేరడిగురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

లలితానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్‌లోని శతాబ్ది అపార్ట్‌మెంట్ నుంచి రాంనగర్ గుండూ వరకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు కోసం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, జలమండలి అధికారులకు లేఖ రాసి అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేయించి పనులు పూర్తిచేసి సమస్యను పరిష్కారం చేయడం జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాండూరి గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం అడిక్‌మెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రెండు దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ పెరిగిన జనాభాకు అనుకూలంగా లేకపోవడంతో నిత్యం డ్రైనేజీ సమస్య ఏర్పడిందన్నారు. సమస్యను తాము కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా జలమండలి అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జలమండలి అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

ప్రవీణ్ పగడాల మరణంపై న్యాయవిచారణ జరిపించాలి

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్

కవాడిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ ప్రచారకులు ప్రవీణ్ పగడాల మరణంపై న్యాయవిచారణ జరిపించాలని, రీ పోస్టుమార్టం నిర్వహించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కేంద్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పగడాలను విజయవాడలో కిడ్నాప్ చేసి అత్యంత కిరాతకంగా చంపి రాజమహేంద్రవరం సమీపంలో రోడ్డుపక్కన పడవేశారని ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను మరో మణిపూర్‌గా చేయడానికి కేంద్రంలో అధికారంలో ఉన్నమోదీ సర్కార్ కుట్రలో భాగంగానే క్రైస్తవ ప్రచార కర్త ప్రవీణ్ పగడాలను హత్య చేయించి యాక్సిడెంట్‌లో చనిపోయాడంటూ కట్టుకథలు అల్లుతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షులు అల్లం సురేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు. పార్టీ నాయకులు చిప్పరి సుబ్బారావు, మద్దెల ప్రవీణ్ కుమార్, సుచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆ భూమిని సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందుండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ల అధ్యక్షుడు, ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో పార్టీ నిర్వహించబోయే ప్లీనరీపై చర్చించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రజా సంక్షేమపథకాలు, అభివృద్ధి పులు ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. హెచ్‌సీయూకి సంబంధించిన 400 ఎకరాల భూమిని విశ్వవిద్యాలయానికి అప్పగించాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించిన ప్రభుత్వం భూమిని చేజిక్కించుకోవడానికి కుట్రలు చేస్తుందన్నారు.